# తనను కాల్చేయాలని ఎమ్మెల్యేకు అగ్గిపెట్టె

- కాంగ్రెస్‌లో కొత్తవారి చేరికలపై గోపాల్‌పేట నాయకుడి మనస్తాపం
- ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎదుటే పెట్రోల్ పోసుకున్న గణేశ్‌గౌడ్
- వనపర్తి జిల్లా కేంద్రంలో కలకలం

వనపర్తి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో చేరికలను నిరసిస్తూ ఓ నాయకుడు ఏకంగా ఎమ్మెల్యే ఎదుటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన వనపర్తి నియోజకవర్గం లో కలకలం రేపింది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సైతం బీఆర్ఎస్ తోపాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తల ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నా రు. అయితే గోపాల్‌పేట మండ లం తాడిపర్తి గ్రామంలో గురువారం సాయం త్రం బీఆర్ఎస్‌కు చెందిన నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో బీఆర్ఎస్ నేతలు తమపై కేసులు పెట్టి అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని, అందుకే వారిని పార్టీలో చేర్చుకోవద్దని గోపాల్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి గణేశ్‌గౌడ్ పార్టీ పెద్దలకు సూచించారు. గణేశ్‌గౌడ్ మాటలను వారు వినకపోగా చేరికల వివరాలు వెల్లడించకపోవడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురై గురువారం ఉదయం వనపర్తిలోని ఎమ్మెల్యే సొంత క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఒంటిపై


పెట్రోల్ పోసుకున్న గణేశ్‌గౌడ్

పెట్రోల్ పోసుకొన్నారు. నిప్పంటించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి అగ్గిపెట్టె ఇచ్చారు. తాను పార్టీని వ్యక్తిగతంగా ఉపయోగించుకోలేదని, గోపాల్‌పేట మండలానికి చెందిన మరో నాయకుడు సత్యశీలారెడ్డి ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టిస్తున్నాడని గణేశ్ ఆవేదన చెందారు. న్యాయం జరగడం లేదనే బాధతో పెట్రోల్ పోసుకున్నట్టు చెప్పారు. మేఘారెడ్డిపై చిన్నారెడ్డి వర్గీయుడు గణేశ్‌గౌడ్ పెట్రోల్‌తో దాడికి ప్రయత్నించాడని ప్రతిగా కొందరు సోషల్ మీడియాలో మెస్సేజ్‌లు పెట్టారు. పైకి బాగానే కనిపిస్తున్నా నియోజకవర్గంలో చిన్నారెడ్డి, మేఘారెడ్డి వర్గాలు బాహాటంగానే గొడవలకు దిగుతుండటంతో పార్టీ నేతలు ఆందోళనకు గురవుతున్నారు.


కరీంనగర్‌లోని అల్గునూరులో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో కార్యకర్త భద్రయ్యపైకి దూసుకెళ్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణను ఆపుతున్న మంత్రి పొన్నం

# కార్యకర్తపైకి దూసుకెళ్లిన ఎమ్మెల్యే

- ప్రశ్నించినందుకు కవ్వంపల్లి సత్యనారాయణ ఆగ్రహం
- మంత్రి పొన్నం ఎదుటే ఘటన

తిమ్మాపూర్, ఏప్రిల్ 18 : కాంగ్రెస్ సమావేశంలో కయ్యం మొదలైంది. గురువారం కరీంనగర్ జిల్లా అల్గునూరులో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో అంతర్గత విభేదాలు మంత్రి పొన్నం ప్రభాకర్ ముందే బహిర్గతమయ్యాయి. మానకొండూరు మండలం లక్ష్మీపూర్‌లోని పోచమ్మ గుడికి వెళ్లే దారిని అదే గ్రామానికి చెందిన మహేందర్ అనే వ్యక్తి కబ్జా చేశాడని కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఎడ్ల భద్రయ్య.. రెండు నెలల కిందట ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కబ్జా చేసిన వ్యక్తి ఇటీవల అనారోగ్యానికి గురికాగా రూ.2.5 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. తమను కాదని మహేందర్‌కు ఎల్‌వోసీ ఎలా ఇచ్చారని భద్రయ్య ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే సభ పైనుంచి కిందికి దూకి కార్యకర్తపైకి దూసుకెళ్లాడు. పక్కనే ఉన్న మంత్రి పొన్నం ఎమ్మెల్యేను నిలువరించే ప్రయత్నం చేశారు. కార్యకర్తపైకి ఎమ్మెల్యే దూసుకెళ్లిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


నిరసన దీక్షలో మోత్కుపల్లి. చిత్రంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు

# మాదిగలకు రేవంత్‌రెడ్డి అన్యాయం

- రెండు సీట్లు ఇచ్చే వరకు పోరాటం
- సీఎం అపాయింట్‌మెంట్ ఇస్తలేడు
- మోత్కుపల్లి నర్సింహులు నిరసన దీక్ష
- పార్టీ సీనియర్ నేతలు వీహెచ్, సర్వే సత్యనారాయణ సంఘీభావం

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ఎంపీ టికెట్ల కేటాయింపు విషయంలో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేసిందంటూ మాజీమంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు గురువారం నిరసనదీక్ష చేపట్టారు. బేగంపేట లీలానగర్‌లోని తన నివాసంలో చేపట్టిన నర్సింహులు దీక్షకు పలువురు మాదిగ నేతలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు బీఆర్ఎస్, బీజేపీ చెరో రెండేసి సీట్లు కేటాయించాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ గతంలో మాల మాదిగలకు చెరో సీటు కేటాయించిందని, ఈసారి మాత్రం మాదిగలకు ఒక్కసీటు కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**సీఎం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదు**

ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసి మాదిగలకు జరిగిన అన్యాయంపై వివరిద్దామంటే తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేవంత్ సీఎం అవుతారని చెప్పిన తొలి వ్యక్తిని తానేనని పేర్కొన్నారు. అలాంటి తనకే అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో తాను ఎంతోమంది సీఎంలను చూశానని కానీ, రేవంత్ హయాంలో మాదిగలకు జరిగినంతటి అన్యాయం గతంలో ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. తమ జాతికి జరుగుతున్న అన్యాయంపై మందకృష్ణ మాదిగ సరిగానే స్పందించారని తెలిపారు. మాదిగలకు రెండు సీట్లు కేటాయించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు నష్టం చేయాలని తాను అనుకోవడం లేదని, మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. పార్టీలో ఉండే పోరాడతానని, పార్టీ మారే ప్రసక్తే లేదని మోత్కుపల్లి తేల్చిచెప్పారు. మోత్కుపల్లి దీక్షకు పార్టీ సీనియర్ నేతలు సర్వే సత్యనారాయణ, వీ హనుమంతరావు సంఘీభావం ప్రకటించారు. సాయంత్రం ఆయన నివాసానికి చేరుకుని నిమ్మరసం అందించి మోత్కుపల్లితో దీక్షను విరమింపజేశారు.

# మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఫైనల్!

- నేడు అధికారిక ప్రకటన!
- పంతం నెగ్గించుకున్న పొంగులేటి
- ఖమ్మం టికెట్ ఆయన సోదరుడికే?

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ ఎట్టకేలకు అభ్యర్థులను ఖరారుచేసినట్టు తెలిసింది. ఈ మూడు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ఎంతకీ కొలిక్కిరాకపోవడంతో పెడింగ్‌లో పెట్టింది. తాజాగా, ఈ స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసినట్టు సమాచారం. ఖమ్మం అభ్యర్థిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, కరీంనగర్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు, హైదరాబాద్ అభ్యర్థిగా సమీర్ వలీవుల్లాను ఖరారు చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శుక్రవారం వీరి పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నది. కరీంనగర్ జిల్లా కాంగెస్ కమిటీ గురువారం వెలిచాల రాజేందర్‌రావుతో మానకొండూరు నియోజకవర్గ ఎన్నికల కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించడం ఈ వార్తలకు ఊతమిస్తున్నది. హైదరాబాద్ విషయంలో ఎంఐఎంతో కుదిరిన లోపాయికారి ఒప్పం దం మేరకు డీసీసీ అధ్యక్షుడు సమీర్ వలీవుల్లాను డమ్మీ అభ్యర్థిగా బరిలోకి దింపాలని నిర్ణయించినట్టు గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

**పొంగులేటిదే పైచేయి**

ఖమ్మం టికెట్ విషయంలో కాంగ్రెస్‌లో ముక్కోణపు పోటీ కనిపించింది. తన భార్య నందిని కోసం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సోదరుడు ప్రసాద్‌రెడ్డి కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కుమారుడు యుగంధర్ కోసం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ పోటీలో పొంగులేటిదే పైచేయి అయింది. అసెంబ్లీ ఎన్నికల హామీ మేరకు ఖరారైనట్టు తెలిసింది.


మాట్లాడుతున్న బాలరాజ్‌గౌడ్. చిత్రంలో వెంకన్నగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్

# కల్లుగీత వృత్తిపై నిర్బంధాన్ని ఎత్తివేయాలి

- గీత కార్మికులపై పెట్టిన కేసులను రద్దు చేయాలి
- గౌడ కల్లుగీత సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ

చిక్కడపల్లి, ఏప్రిల్ 18: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కల్లు గీత సొసైటీలపై విధించిన నిర్బంధాన్ని ఎత్తివేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చిక్కడపల్లిలోని కమిటీ కార్యాయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సొసైటీలపై పోలీసులు, రెవెన్యూ, ఎన్సీబీ బృందాలు విచ్చలవిడిగా దాడులు చేసి సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారని, శాంపిళ్ల పేరిట పలువురిని అరెస్టు చేసి జైళ్లలో పెట్టారని, అనేక మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారని తెలిపారు. కల్లుగీత వృత్తిని పర్యవేక్షించే ఆబ్కారీ శాఖకు సబంధం లేకుండానే దాడులు చేస్తున్నారని తెలిపారు. వెంటనే గీత కార్మికులపై పెట్టిన అన్ని కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. గౌడల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. చెట్ల పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని, గౌడ కులస్థులకు వైన్‌షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గౌడలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీ సీటు కేటాయించకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ఒక సీటు కేటాయించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పోతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ.. ఓ మానవమృగం

- రాముడి పేరుతో రాజకీయం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజం

హుజూరాబాద్/ తిమ్మాపూర్, ఏప్రిల్ 18 : 'ప్రధాని మోదీ ఓ మానవ మృగం, రాహుల్‌గాంధీ మానవతావాది.. రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నది.. తెలంగాణ అంటే భగ్గునమండే మోదీకి ఇక్కడ ఓట్లు అడిగే హక్కు లేదు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ శివారు అల్గునూరు, హుజూరాబాద్‌లో గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా తెలంగాణకు బీజేపీ ఒరగబెట్టిందేమీ లేదని, విభజన హామీలను నేటికీ అమలు చేయలేదని



విమర్శించారు. రాష్ట్రానికి ఏమీ చేయని బీజేపీ, ఇక్కడ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. రాముడి ఫొటో పెట్టుకొని ఓట్లు అడగడం కాదని, కరీంనగర్ జిల్లాలోని ఇల్లందకుంట రామాలయాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదో జవాబు చెప్పిన తర్వాతే ఓట్లడగాలని నిలదీశారు. మోదీ పాలనలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా శాంతి లేదని ఆరోపించారు. సమావేశాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, హుజూరాబాద్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు వొడితెల ప్రణవ్, పురమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

